# చదవడాన్ని ప్రేమించాలి...



రాజమౌళి
కలెక్టర్ బిజ్నూర్ (యూపీ)

సివిల్స్ అంటే బ్రహ్మ పదార్థం! పోటీ తట్టుకోవడం కష్టం!! సాధారణంగా అభ్యర్థుల్లో ఉండే అభిప్రాయాలు. అయితే ఇవి కేవలం అపోహలే. చిత్తశుద్ధి, సాధించాలనే తపన, పట్టుదల ఉంటే గమ్యానికి చేరువ కావడం సులువే. ముఖ్యంగా ప్రిలిమ్స్ ప్రిపరేషన్‌లో వీటి అవసరం ఎంతో. ఇది అర్హత పరీక్షే కదా.. అనే సాదాసీదా వైఖరి సరికాదు. అనుక్షణం పకడ్బందీ ప్రిపరేషన్ తప్పనిసరి. మెటీరియల్ సేకరణ నుంచే దీన్ని అలవర్చుకోవాలి. చాలామంది అభ్యర్థులు ప్రతి అంశంపైనా అందుబాటులో ఉన్న సమాచారం ఆసాంతం సేకరిస్తారు. అయితే.. అభ్యర్థి నుంచి యూపీఎస్సీ ఏమి ఆశిస్తుందో తెలుసుకోకుండా, అవగాహన లేకుండా సమాచారాన్ని సేకరించడం వల్ల ఉపయోగం ఉండదు. పైగా.. మొత్తం సమాచారాన్ని చదవలేక.. క్రమ పద్ధతిలో అమర్చుకోలేక సతమతమవుతారు. విస్తృత మెటీరియల్‌లో చదవని అంశాలపై ఆందోళనకు గురవుతారు. అందుకే.. ఎలాంటి పుస్తకాలు చదవాలి? అనే విషయంలో మిత్రులు, సీనియర్లు, అధ్యాపకులతో సంప్రదింపులు మేలు చేస్తాయి. వారి సలహాలతో మంచి పుస్తకాలను ఎంచుకోవాలి. నిరంతర పఠనం, మననంతో విషయ పరిజ్ఞానం, భావ ప్రకటనా సామర్థ్యం అలవడతాయి. విషయ పరిజ్ఞానం ప్రిలిమ్స్‌కు ఉపయోగపడితే.. భావ ప్రకటనా సామర్థ్యం మెయిన్స్‌లో మేలు చేస్తుంది. అంతేకాక భాషపైనా పట్టు కూడా లభిస్తుంది.

### ఆప్షనల్‌కు అధిక సమయం:

ఇప్పటి నుంచి పరీక్ష తేదీ వరకు ఉన్న నాలుగున్నర నెలల వ్యవధిలో రోజుకు దాదాపు 15 గంటల ప్రిపరేషన్ చేయడం వల్ల సానుకూల ఫలితాన్ని ఆశించవచ్చు. ఈ క్రమంలో అత్యధిక మార్కులు ఉండే ఆప్షనల్ సబ్జెక్టుకు ఎక్కువ సమయం అంటే.. 60 శాతం సమయం ఆప్షనల్‌కు, మిగతా సమయాన్ని జనరల్ స్టడీస్‌కు కేటాయించాలి. ఈ ఆప్షనల్ మెయిన్స్‌లో ఒక ఆప్షన ల్‌గా ఉండేలా చూసుకుంటే ప్రిపరేషన్ రెండిటికీ(ప్రిలిమ్స్, మెయిన్స్) ఉపయోగపడుతుంది. ఇక.. సిలబస్‌లోని ప్రతి కాన్సెప్ట్‌పై సంపూర్ణ విషయ పరిజ్ఞానం సొంతం చేసుకోవాలి. దీనికోసం.. చదివిన కాన్సెప్ట్‌ను స్వీయ బోధన పద్ధతిలో నెమరు వేసుకోవడం ఉపయుక్తం. జనరల్ స్టడీస్ విభాగంలో మంచి మార్కులు సొంతం చేసుకోవాలంటే.. స్టాండర్డ్ బుక్స్‌ను క్షుణ్నంగా నాలుగుసార్లు చదివేలా సమయ ప్రణాళిక రూపొందించుకోవాలి. ఈ క్రమంలో గంటకు చదవగలిగే సమయం ఎంత? నాలుగుసార్లు రివిజన్‌కు వీలుగా విషయ సేకరణ ఎలా చేసుకోవాలి? వంటి విషయాలపై అవగాహన పెంచుకోవాలి. ప్రిలిమ్స్ జీఎస్‌లో అత్యంత కీలకమైన విభాగం కరెంట్ అఫైర్స్. ఇందుకోసం వార్తా పత్రికలు ఎంతో తోడ్పడతాయి. అభ్యర్థులు ప్రతి రోజూ గంటల కొద్దీ వాటిని చదివి సయయం వృధా చేసుకోకుండా.. ఏది

SAKSHI

ఉపయోగం? ఏది నిరుపయోగం? అని బేరీజు వేసుకోవాలి. వార్త చదివేటప్పుడు ప్రశ్న పూరిత మనసుతో చదవడం కచ్చితంగా ఉపయో గపడుతుంది.

ఆప్షనల్‌కు సంబంధించి ముఖ్యమైన కాన్సెప్ట్‌లను ఒకటికి పదిసార్లు చదవడం వల్ల సంపూర్ణ అవగాహన సొంతం చేసుకోవచ్చు. అంతేకాక ఆయా కాన్సెప్ట్‌లు లేదా అధ్యాయాలపై గత ప్రశ్న పత్రాల్లో అడిగిన ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. రివిజన్ సమయంలో.. అప్పటికే చదివిన ప్రశ్నల కోణంలో చదివితే కొత్త విషయాలు, అంతకుముందు స్ఫురించని అంశాలు తెలుసుకునే అవకాశం కూడా ఉంటుంది. ఆప్షనల్ సిలబస్ ప్రిపరేషన్ పూర్తైందని నమ్మకం కలిగిన తర్వాత వీలై నంత ఎక్కువ సంఖ్యలో మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేయాలి. పరీక్షలో యూపీఎస్సీ నిర్దేశించిన వ్యవధి మాదిరిగానే ఈ ప్రాక్టీస్ చేయాలి. తద్వారా స్వీయ విశ్లేషణ చేసుకుని బలహీనతలు తెలుసుకునే అవకాశంతోపాటు.. అభ్యర్థి వేగాన్ని కూడా లెక్కించడానికి వీలవుతుంది. చివరగా.. ఆప్షనల్ ఎంపిక కూడా అత్యంత కీలకమైన అంశం. వ్యక్తిగత అభిరుచి, సమాచార లభ్యత, విషయ పరిజ్ఞానం ఆధారంగా ఈ ఎంపిక జరగాలి. ఒకసారి ఆప్షనల్ ఎంచుకుంటే.. రెండుమూడేళ్లు దాన్ని చదవాల్సి ఉంటుంది. ఏ సందర్భంలోనూ విసుగు చెందకూడదు. ఈ నేపథ్యంలో.. ఒక సబ్జెక్టును ప్రేమించే గుణం అలవ ర్చుకోవడం ఎంతో ప్రధానం. అన్నిటికీమించి మారథాన్ పరుగుపందెం లాంటి సివిల్స్ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించాలంటే.. సహనం, సంయమనం, అంకితభావం, చేసేపనిని ఆనందించడం వంటి లక్షణాలు అలవర్చుకోవాలి.

**మరికొన్ని సూచనలు:**

- చదివేటప్పుడు గంటకు 12 నుంచి 15 పేజీలు చదవగలిగేలా వేగం పెంచుకోవాలి.
- జనరల్ స్టడీస్ పేపర్లో 85 నుంచి 90 ప్రశ్నలకు సమాధానాలిస్తే ప్రిలిమ్స్‌లో గట్టెక్కినట్లే. అందువల్ల ఈ దిశగా కృషి చేయాలి.
- ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుత్సాహానికి గురి కాకూడదు. ఐదేళ్లపాటు చదివినా కనీసం ప్రిలిమ్స్‌లో విజయం సాధించని వారు కూడా ఉంటారు. కాబట్టి మొదటి ప్రయత్నంలో విజయం లభించకపోయినా నిరాశ కూడదు.
- ప్రభుత్వం నియమించిన కమిటీలు, వాటి నివేదికల గురించి కచ్చితంగా తెలుసుకుని ఉండాలి.
- విసుగు కలిగినప్పుడు ఇష్టమైన పని చేసి రిలాక్స్ అవడం ద్వారా ఆ సమస్యను అధిగమించవచ్చు.